# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | గురువారం, జనవరి 15, 2026 | సంపుటి:11 | సంచిక :264 | పేజీలు: 8 | వెల : రూ.5




## తక్షణమే ఇరాన్‌ను వీడండి

భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు




## తెలంగాణ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, నవతరం: రాష్ట్ర ప్రజలకు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలతో మూడు రోజులపాటు సంక్రాంతి వైభవం కొనసాగుతుందని అన్నారు. ?ఈ సందర్భంగా పల్లెలన్నీ రంగవల్లులు, గొబ్బెమ్మలతో నిండి ప్రకృతి రమణీయతను సంతరించుకుంటాయని కేసీఆర్ తెలిపారు. సంక్రాంతి శోభతో రాష్ట్రవ్యాప్తంగా సంతోషాలు వెల్లివిరుస్తాయని అన్నారు. దక్షిణం నుంచి ఉత్తరాయణానికి సూర్యుడు ప్రవేశించే మకర సంక్రాంతి పర్వదినం, హిందూ శాస్త్ర పురాణాల్లో ప్రత్యేకతను సంతరించుకున్నదని కేసీఆర్ తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన వ్యవసాయాభివృద్ధిని ఈ సందర్భంగా స్మరించుకున్న కేసీఆర్, రాష్ట్ర వ్యవసాయరంగం, రైతాంగ సంక్షేమం తిరిగి గాడినపడి, తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పవన్‌కళ్యాణ్‌కు అభినందనలు

### ::: భారత ప్రధాని నరేంద్ర మోదీ

న్యూ ఢిల్లీ / హైదరాబాద్, నవతరం: మార్షల్ ఆర్ట్స్ లో ఘనత సాధించి తెలుగు రాష్ట్రాల్లో మొదటి సమురాయ్ గా గుర్తింపు సాధించిన ఏపీ ఉప ముఖ్యమంత్రి, టాలీవుడ్ నటుడు కొణిదెల పవన్ కళ్యాణ్ కు అభినందనలు తెలిపారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. ఈ సందర్భంగా లేఖలో ఆయన "పవన్ కళ్యాణ్... జపనీస్ మార్షల్ ఆర్ట్స్ రంగంలో మీరు సాధించిన విజయాల వార్త నాకు ఇటీవల తెలిసింది. కెంజుట్సులో అధికారిక ప్రవేశం అనే అరుదైన ఘనతను సాధించినందుకు నా హృదయపూర్వక అభినందనలు దయచేసి అంగీకరించండి. మీ బిజీగా ఉన్న సినిమా కెరీర్‌లో అయినా, లేదా మీ ప్రజా జీవితంలో అయినా, మీరు నిరంతరం అద్భుతమైన క్రమశిక్షణ మరియు నిజాయితీతో మార్షల్ ఆర్ట్స్‌ను అభ్యసించారు. ఈ అభ్యాసం పట్ల మీ దశాబ్దాల నిబద్ధత నిజంగా ప్రశంసనీయం. ఒకరి వృత్తిపరమైన బాధ్యతలు ఎంత డిమాండ్‌తో ఉన్నా, స్వీయ-అభివృద్ధి మరియు జీవితాంతం నేర్చుకోవడానికి సమయం కేటాయించడం ఎల్లప్పుడూ సాధ్యమేనని ఇది యువ తరానికి బలమైన సందేశాన్ని పంపుతుంది. మార్షల్ ఆర్ట్స్ శారీరక బలాన్ని మాత్రమే కాకుండా, మానసిక సమతుల్యత, ఓర్పు మరియు అంతర్గత క్రమశిక్షణను కూడా కోరుతుంది. అటువంటి కఠినమైన సంప్రదాయాన్ని అనుసరించడం అనేక విధాలుగా స్వీయ ఆవిష్కరణ ప్రయాణం. ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన, చురుకైన సమాజాన్ని ప్రోత్సహిస్తున్న సమయంలో, ప్రజా జీవితంలోని వ్యక్తులు ఆదర్శంగా నడిపించడం చాలా ముఖ్యం. ఫిట్‌నెస్, క్రమశిక్షణ పట్ల మీ వ్యక్తిగత నిబద్ధత నిస్సందేహంగా చాలా మంది ఇతరులను వారి ఆరోగ్యం, శ్రేయస్సును తీవ్రంగా పరిగణించేలా ప్రేరేపిస్తుంది. ఈ విజయానికి మరోసారి అభినందనలు. మీ భవిష్యత్ ప్రయత్నాలలో మీరు విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని రాశారు.

### ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం

గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ.. కెంజుట్సులో నన్ను చేర్చుకున్నందుకు మీ దయగల శుభాకాంక్షలు, ప్రేరణాత్మక



మాటలకు చాలా ధన్యవాదాలు. నాకు, మార్షల్ ఆర్ట్స్ ఎల్లప్పుడూ క్రమశిక్షణ, సమతుల్యత మరియు మనస్సు, శరీరం, ఆత్మ యొక్క సామరస్యం గురించి... సర్, మీరు ఎల్లప్పుడూ మీ నాయకత్వం ద్వారా పౌరులను, ముఖ్యంగా యువతను ప్రేరేపించారు. పరీక్ష పే చర్చా, ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా, మీరు మా యువత ఆరోగ్యంగా, బలంగా, మరింత నమ్మకంగా మారడానికి మార్గనిర్దేశం చేస్తున్నారు, తద్వారా భారత్ భవిష్యత్తును రూపొందిస్తున్నారు. మీ మాటలు నా ప్రయాణానికి కొత్త బాధ్యతను జోడించాయి. మన భారత్‌కు సేవ చేయడానికి, యువతరం క్రమశిక్షణతో జీవించడానికి, మన వారసత్వాన్ని గౌరవించడానికి, దేశం కోసం నిర్భయంగా పనిచేయడానికి నేను మరింత కష్టపడి పనిచేస్తాను. మీ నిరంతర వెచ్చదనం మరియు ప్రేరణకు ధన్యవాదాలు అన్నారు ఏపీ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ కొణిదెల పవన్ కళ్యాణ్.

## తప్పుచేసినవాళ్లు ఎక్కడున్నా వదిలిపెట్టం

హైదరాబాద్, నవతరం: జర్నలిస్టుల అరెస్ట్ పై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విలేకరులు ఎలాంటి తప్పు చేయకపోతే పిలిచినప్పుడు వస్తారు కదా... బ్యాంకాక్ వెళుతున్నాం అంటూ సాకులు చెప్పారు కదా...? అన్నారు. ఇప్పటికే చాలా మంది సోషల్ మీడియా లో తప్పుడు పోస్టులు రాస్తున్నారు. ఎమర్జెన్సీ పాలన అని, రకరకాలుగా కొందరు మాట్లాడుతున్నారు.. నిజంగా ఎమర్జెన్సీ పాలన ఉంటే మీరు అందరూ కూడా లోపల ఉండే వాళ్ళు అన్నారు. ఇంటి తలుపులు పగలగొట్టి జర్నలిస్ట్ భార్యను భయభ్రాంతులకు గురిచేస్తూ జర్నలిస్టులను అరెస్ట్ చేస్తారా అని ఒక మహిళా జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ సజ్జనార్... ఏ తప్పూ చెయ్యకపోతే విచారణకు సహకరిస్తామని చెప్పి బ్యాంకాక్ ఎందుకు పారిపోతున్నారు? నిన్న సాయంత్రం ఐదున్నరకే బ్యాంకాక్ కి టికెట్స్ బుక్ చేసుకుని ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. మేము ఎక్కడా డోర్లు పగలగొట్టలేదు, తప్పు చేసినవాళ్లు ఎక్కడున్నా పట్టుకొస్తామన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూడా అరెస్ట్ చేస్తాం. తప్పు చేసినవాళ్లు ఎక్కడ ఉన్నా వదిలిపెట్టం, న్యాయస్థానం ముందు నిలబెడతాం అన్నారు.



# జర్నలిస్టుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

**పండుగపూట ముగ్గురు జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**

**నోటీసులతో విచారణకు పిలవాల్సింది పోయి అర్ధరాత్రి దాడులా వ్యవహారం**

**డీజీపీ జర్నలిస్టులను నేరస్తుల్లా చూడటం దురదృష్టకరం**

**కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోందన్న ఆరోపణ**

**అరెస్టులను ఉపసంహరించి జర్నలిస్టులను విడుదల చేయాలన్న డిమాండ్**



హైదరాబాద్, జనవరి 14 : తెలంగాణలో ముగ్గురు జర్నలిస్టులను అత్యంత అమానవీయంగా, చట్టవిరుద్ధంగా అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పండుగ వాతావరణం నెలకొన్న సమయంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పాలన తీరును చూస్తే దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ రోజులు గుర్తుకొస్తున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా స్వేచ్ఛను అణిచివేసే దిశగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. జర్నలిస్టులను రాష్ట్ర డీజీపీ నేరస్తుల్లా చూడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక స్థంభమని, అలాంటి జర్నలిస్టులపై ఈ రీతిలో చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. విచారణ అవసరం ఉంటే జర్నలిస్టులకు ముందుగా నోటీసులు ఇచ్చి పిలవాల్సిందని కేటీఆర్ సూచించారు. అర్ధరాత్రి వేళ వారి ఇళ్లకు వెళ్లి అరెస్టులు చేయడం అతిగా వ్యవహరించడమే కాకుండా, భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నంగా భావించాల్సి వస్తుందని అన్నారు. ఇటువంటి చర్యలు ప్రజల్లో ప్రభుత్వంపై అనుమానాలు పెంచుతాయని హెచ్చరించారు. మీడియాను నియంత్రించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహా చర్యలకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని తెలిపారు. జర్నలిస్టుల భద్రత, స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియాపై ప్రతీకార ధోరణితో వ్యవహరించడం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. లేకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు.

# ఇన్‌స్టాగ్రామ్ వలలో చిక్కిన బాధితులు దంపతుల బ్లాక్‌మెయిల్ బాగోతం

కరీంనగర్ : సోషల్‌మీడియాను అడ్డంగా పెట్టుకుని అక్రమ దందా సాగించిన ఓ దంపతుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తూ పరిచయాలు పెంచుకున్న మహిళ, తన వలలో పడిన వారితో డబ్బు తీసుకుని ఏకాంతంగా గడిపేది. అదే సమయంలో ఆమె భర్త గుట్టుగా వీడియోలు తీసి, వాటిని ఆధారంగా చూపిస్తూ బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ విధంగా రెండేళ్లుగా పలువురిని మోసం చేసిన కరీంనగర్‌కు చెందిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఈ దంపతులు గత పదేళ్లుగా కరీంనగర్ ఆరెపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. భర్త గ్రానైట్, ఇంటీరియర్ డిజైన్ వ్యాపారం నిర్వహించగా, భార్య యూట్యూబ్ చానల్ నడుపుతోంది. వ్యాపారంలో నష్టాలు రావడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో సోషల్‌మీడియా వేదికగా పథకం రచించారు. మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో వెయ్యికి పైగా ఫాలోవర్స్ ఉండటంతో, ఆ పరిచయాలను ఆసరాగా చేసుకుని అక్రమ కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఆమె పోస్టులు చూసి ఆకర్షితులై సంప్రదించిన వారిని ఇంటికి లేదా ఇతర ప్రదేశాలకు పిలిచి, ముందుగా డబ్బు తీసుకునేవారు. ఆ సమయంలో భర్త రహస్యంగా వీడియోలు రికార్డ్ చేసేవాడు. అనంతరం ఆ వీడియోలను బయటపెడతామంటూ బెదిరిస్తూ భారీగా డబ్బులు వసూలు చేసేవారు. ఈ బ్లాక్‌మెయిల్ దందాలో వ్యాపారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, యువకులు పలువురు బాధితులుగా మారినట్లు పోలీసులు గుర్తించారు. వసూలు చేసిన డబ్బుతో దంపతులు విలువైన ఆస్తులు కూడబెట్టారు. సుమారు రూ.65 లక్షల విలువైన ఫ్లాట్, ఖరీదైన ఫర్నిచర్, రూ.10 లక్షల కారును కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. మహిళకు తన ఫాలోవర్స్‌లో సుమారు వంద మందితో పరిచయాలు ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తిని ఈ దంపతులు మరింతగా వేధించారు. గతంలో అతడి నుంచి సుమారు రూ.14 లక్షల వరకు వసూలు చేసిన దంపతులు, మరోసారి రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు దిగారు. డబ్బు ఇవ్వకపోతే వీడియోలను బహిర్గతం చేస్తామని, ప్రాణహానీ చేస్తామని కూడా హెచ్చరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు, సమర్పించిన ఆధారాల మేరకు కేసు నమోదు చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులైన దంపతులను అరెస్టు చేశారు. వారి నుంచి కారు, మొబైల్ ఫోన్లు, నగదు, చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.



# తొలిరోజే కోడి పందేలలో కోట్ల రూపాయల లావాదేవీలు





అమరావతి: ఉమ్మడి పశ్చిమగోదావరిలో బుధవారం కోడి పందేలు భారీస్థాయిలో జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే పందెగాళ్లు పలు చోట్ల వాటికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీగా కార్లలో తరలివచ్చుటంతో బరుల వద్ద ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఏలూరు జిల్లాలో దుగ్గిరాల, మీర్జాపురం, చేబ్రోలు, గొల్లగూడెం, కొయ్యలగూడెం, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, చింతలపూడి, పోలవరం ప్రాంతాలు, డెల్టాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో వందల సంఖ్యలో బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, ఉంసభాపతి రఘురామకృష్ణరాజు, గంటా శ్రీనివాసరావు, ఎంపీ సానా సతీష్‌బాబు బరుల వద్ద కనిపించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు కనకయ్య, ఆదినారాయణ హాజరై పందేలు తిలకించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ కోళ్లు కత్తులు దూశాయి. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం 90కు పైగా బరుల్లో దాదాపు 10 వేల పందేలు జరిగినట్లు అంచనా. కోడి పందేలు, గుండాట, కోతముక్కల్లో రూ.100 కోట్లకు పైగా చేతులు మారినట్లు అంచనా. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భారీ బరి వద్ద బుధవారం 25 పందేలు నిర్వహించారు. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పందేలు సాగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడి పందేలతో పాటు పెద్దఎత్తున కోతముక్క, గుండాట తదితరాలు నిర్వహించారు. విజయవాడ రూరల్, ఉప్పులూరు, కేసరపల్లి, విస్సన్నపేట, ఈడుపుగల్లు, గొడవర్రు, తిరువూరు, కంకిపాడు, ఆకునూరు, కాటూరు, గుడ్లవల్లేరు, గుడివాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో పందేలు కాశారు. కోడి పందేల కంటే కోతముక్కలు, గుండాట, లోనాబయట, కాయ్‌రాజా కాయ్ వంటి జూద క్రీడల్లోనే రూ.కోట్లు చేతులు మారాయి. గన్నవరం పరిధిలోని కేసరపల్లిలో పందెగాళ్లను ఆకట్టుకునేందుకు మూడు కార్లను బహుమతిగా పెట్టారు.

# మహిళలను కించపరిస్తే దేశానికే నష్టం: సీపీ సజ్జనార్



హైదరాబాద్, జనవరి 14: తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారమైన ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఈ సిట్ దర్యాప్తు జరగనుంది. ఈ నేపథ్యంలో మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో విమర్శలు సహజమే అయినా, మహిళలపై వ్యక్తిగత దాడులు, అసభ్య వ్యాఖ్యలు, ప్రతిష్ఠ హననం చేయడం విమర్శల కిందికి రావని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితమని సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్తా కథనాల పేరుతో మహిళలపై జరుగుతున్న దూషణలు అసహ్యకరమని పేర్కొన్నారు. మహిళలను అవమానించడం, కించపరచడం ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. పాలన, పోలీస్ శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా అన్ని రంగాల్లో మహిళలు ముందువరుసలో నిలబడి నాయకత్వం వహిస్తున్నారని గుర్తు చేశారు. ఇల్లు, ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తూ కుటుంబాన్ని నడిపిస్తూ సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు చేయడం ప్రగతిపై దాడులేనని స్పష్టం చేశారు. భారతీయ సంప్రదాయం చెప్పే 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' అనే సూక్తిని గుర్తు చేస్తూ, మహిళలకు గౌరవం ఉన్న చోటే అభివృద్ధి ఉంటుందన్నారు. మహిళలను గౌరవించని సమాజం తన భవిష్యత్తునే కోల్పోతుందని హెచ్చరించారు. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టమని పేర్కొంటూ, మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇకపై సహించబోమన్నది స్పష్టమైన సందేశమని తెలిపారు. 'ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్ల అంటూ ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుందని, అవమానంతో కాదని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టు పర్వం

హైదరాబాద్: మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాల ప్రసారం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును మరింత ఉద్ధృతం చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో సాగుతున్న ఈ విచారణలో భాగంగా ఎన్టీవీ ఛానెల్‌కు చెందిన ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్ సుధీర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో రిపోర్టర్ పరిపూర్ణాచారిని విచారించిన అనంతరం నోటీసులు జారీ చేసి విడుదల చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్‌రంజన్ ఫిర్యాదు మేరకు ఈ నెల 10న సీసీఎస్‌లో కేసు నమోదైంది. కథనాల ప్రసారానికి సంబంధించి ఎన్టీవీతో పాటు పలు టీవీ ఛానెల్స్, యూట్యూబ్ వేదికలు, డిజిటల్ మీడియా సంస్థల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. విచారణలో భాగంగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్‌ను శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో సిట్ అదుపులోకి తీసుకోగా, రిపోర్టర్లు సుధీర్, పరిపూర్ణాచారిలను బషీరాబాగ్‌లోని సీసీఎస్‌కు తరలించి సుదీర్ఘంగా విచారించారు. విచారణ అనంతరం పరిపూర్ణాచారికి నోటీసులు జారీ చేయగా, రమేశ్, సుధీర్‌లను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఎన్టీవీ కార్యాలయంలో సిట్ బృందం తనిఖీలు నిర్వహించింది. కథనాల తయారీకి ఉపయోగించిన కంప్యూటర్లు, స్క్రిప్టులు, ఇతర సాంకేతిక వివరాలపై సమాచారం కోరగా ఛానెల్ సిబ్బందితో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు విచారణకు సహకరించాలని కోరుతూ యాజమాన్యానికి లేఖ అందజేశారు. అనంతరం ఒక సీపీయూను, సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల సమయంలో కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రి ఎన్టీవీ సీఈవో నివాసానికి సిట్ వెళ్లినా ఆయన అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెళ్లినట్లు సమాచారం. మరికొన్ని ఛానెల్స్, డిజిటల్ మీడియా ప్రతినిధులను సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన రాలేదని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మీడియాతో మాట్లాడుతూ, విచారణకు పిలిచినప్పుడు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక జర్నలిస్టు విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన నేపథ్యంలోనే సోదాలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. తప్పు చేయకపోతే భయపడాల్సిన అవసరం లేదని, దర్యాప్తులో సహకరించని వారిని ఎక్కడున్నా చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. అరెస్టులపై కొందరు నిరంకుశత్వం అంటూ విమర్శలు చేస్తున్నారని, అయితే చట్టబద్ధమైన విచారణ జరుగుతున్నప్పుడు ఎవరికీ మినహాయింపు ఉండదని సజ్జనార్ తేల్చిచెప్పారు. మహిళల గౌరవాన్ని హరించేలా జరిగిన ఘటనలపై ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ సీరియస్‌గా వ్యవహరిస్తోందని, ఈ కేసులో విచారణ మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని అధికారులు సూచిస్తున్నారు.

# తక్షణమే ఇరాన్‌ను వీడండి

**భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు**

ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది. తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది. ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ cons.tehran@mea.gov.in లను పంచుకుంది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచించింది. విదేశాంగ శాఖ ఇంతకుముందు కూడా ఇలాంటి నోటీసు జారీ చేసింది.





# గాగిల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాలు

### పది కమర్శియల్ శెట్టర్లు నిర్మించినా చర్యలు శూన్యం
### అక్రమ వసూళ్లలో ఆరితేరిన లంచగొండి అధికాకరులు
### దుండిగల్ సర్కిల్ లో ఆడిందే ఆట... పాడిందే పాట
### ప్రభుత్వ ఖాజానాకు భారీ గండి
### చర్యలు తీసుకోవాలంటున్న స్థానిక ప్రజలు



దుండిగల్, నవతరం: దుండిగల్ మండల పరిధిలోని గాగిల్లాపూర్ సర్వే నంబర్ 187, 189, 186 లోని వివాదాస్పద భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా పది అక్రమ శెట్టర్ల నిర్మాణం చేపట్టారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్న మున్సిపల్ చట్టాల ప్రకారం టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతుల మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. గతంలో దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు సైతం ఇక్కడి నిర్మాణాలను పట్టించుకోకపోగా... ప్రస్తుత జీహెచ్ఎంసీ అధికారులు సైతం అదే మొద్దు నిద్ర లో ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికైనా దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్ సర్వే నంబర్ 186, 187, 189, తదితర సర్వే నంబర్లలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఈజీ మనీకి అలవాటుపడి దొంగతనాలు

### సమీప ప్రాంతాల్లో ఇత్తడి, కాపర్ వంటి లోహాల దొంగతనాలు వాళ్ల టార్గెట్.
### బర్మా నుంచి వచ్చిన రోహింగ్యాలు
### పోలీసులకు తలనొప్పిగా మారిన శరణార్థులు



హైదరాబాద్, జనవరి 14,నవతరం: బర్మాదేశం నుంచి శరణార్థుల ముసుగులో అక్రమంగా దేశంలోకి చొరబడిన రోహింగ్యాలు ఇప్పుడు కేవలం సామాన్యులకే కాదు, పోలీసులకు కూడా తలనొప్పిగా మారారు. ఒకప్పుడు పొట్టకూటి కోసం చిన్న పనులు చేస్తున్నారన్న పేరుతో సహానుభూతి పొందిన వీరు, ఇప్పుడు క్రమంగా నేరాల వైపు అడుగులు వేస్తూ రాష్ట్ర భద్రతకే ముప్పుగా మారుతున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం, బర్మా దేశానికి చెందిన హమీద్ హుస్సైన్, జహాంగీర్ ఆలం, షఫిక్ ఆలం, మహమ్మద్ ఇస్లాం, కమల్ హుస్సేన్, కైసర్, నూర్ ఖాసింలు 2012--13 మధ్య కాలంలో రోహింగ్యాలుగా అక్రమంగా భారత్‌లోకి చొరబడ్డారు. ప్రస్తుతం వీరంతా హైదరాబాద్ బాలానగర్‌లోని రాయకల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మొదట చిన్నచిన్న పనులు చేస్తూ జీవనం సాగించిన ఈ గుంపు, క్రమంగా ఈజీ మనీకి అలవాటు పడింది. సమీప ప్రాంతాల్లో ఇత్తడి, కాపర్ వంటి లోహాల దొంగతనాలు చేసి స్క్రాప్ షాపుల్లో అమ్మడం మొదలుపెట్టారు. అనంతరం నగరానికి దూరంగా ఉన్న జిల్లాలను లక్ష్యంగా చేసుకుని షాపులు, పరిశ్రమలను లూటీ చేయడం ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీన ఏడుగురు సభ్యులున్న ఈ రోహింగ్యాల ముఠా హైదరాబాద్ నుంచి నల్లగొండకు ఆటోలో వచ్చింది. అద్దంకి--నార్కెట్‌పల్లి రహదారి పక్కన ఉన్న నిధి పైపుల కంపెనీపై కన్నేసింది. అక్కడ సెక్యూరిటీ గార్డ్ లేకపోవడంతో గేటు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడి నుంచి పైపుల తయారీలో ఉపయోగించే ఇత్తడి సైజర్లు (40), అమరాన్ బ్యాటరీలు (35), యుపిఎస్ కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ (50 కేజీలు), దొంగతనం చేశారు. అన్ని వస్తువులు ఒకేసారి తీసుకెళ్లలేక, కంపెనీ వెనుక చెట్ల పొదల్లో దాచి బాలాపూర్‌కు వెళ్లారు. సోమవారం రోజున మళ్లీ ముగ్గురు సభ్యులు నల్లగొండకు వెళ్లి, దాచిన మెటీరియల్‌ను ఆటోలో లోడ్ చేసుకొని తిరిగి వస్తుండగా చర్లపల్లి శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు చిక్కారు. పోలీసులను చూసి ఆటో ఆపకుండా పారిపోయేందుకు యత్నించడంతో అనుమానం వచ్చి పట్టుకున్నారు. ఈ ముఠాపై మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే కేసులు నమోదై ఉన్నాయని, వీరిలో కొందరు జైలు జీవితం కూడా గడిపి వచ్చినవారేనని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ మళ్లీ నేరాలకు పాల్పడడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అని పేర్కొన్నారు. దేశంలోకి అక్రమంగా చొరబడి దొంగతనాలు, సంఘటిత నేరాలకు పాల్పడుతున్న రోహింగ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



## సారపాక, భాస్కర్ నగర్ ప్రాంతంలో భారీగా ఇసుక నిల్వలు

సారపాక, నవతరం: టిప్పర్ లతో ప్రతి రోజు రాత్రి వేళలలో భద్రాచలం, పాల్వంచ, సూదుర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలింపు... రెవిన్యూ, పోలీస్ అధికారులు ఎన్ని సార్లు కేసులు నమోదు చేసిన, ఇసుక నిల్వల ను సీజ్ చేసిన భాస్కర్ నగర్ ప్రాంతంలో ఆగని అక్రమ ఇసుక రవాణా... భాస్కర్ నగర్ ప్రాంతంలో జరిగే ఈ అక్రమ ఇసుక రవాణా పై అధికారులు దృష్టి సారించి ఇసుక నిల్వల ను సీజ్ చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## తెలుగు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

### తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ నాయకుడు గొల్ల జాన్



హైదరాబాద్, జనవరి 14,నవతరం: తెలుగు ప్రజల పండుగలలో అత్యంత విశిష్టమైన భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అనేది రైతుల కష్టానికి ప్రతిఫలంగా నిలిచే పండుగగా, ప్రకృతి, మనిషి మధ్య అనుబంధాన్ని ప్రతిబింబించే మహత్తర పర్వదినంగా పేర్కొన్నారు. మూడు రోజుల పండుగల్లో తొలి రోజు భోగి ధనుర్మాసానికి ముగింపు పలికే పర్వదినంగా, కొత్త జీవనానికి ఆహ్వానం పలికే శుభసూచకంగా భావిస్తారు. రెండోరోజు మకర సంక్రాంతి నాడు సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించడం ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగు, సంతోషం, శుభఫలితాలు నిండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని వ్యవసాయ రంగ అభివృద్ధికి అనేక సంస్కరణలు అమలు చేస్తోందని, రైతులు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకునేలా చర్యలు చేపడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, పంటలకు గిట్టుబాటు ధరలు వంటి అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా వేడుకలు జరుపుకుంటూ, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పేదలు, రైతుల, కార్మికుల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. చివరిగా, భోగి, సంక్రాంతి, మకర సంక్రాంతి పర్వదినాలు ప్రతి ఇంటా ఆనందాన్ని, ఐక్యతను, శ్రేయస్సును నింపాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.


## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్

Plot No. 174 to 176, phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051. 9391221697

**చదువుకునే పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం**

బి. యన్. రెడ్డి నగర్ ఫేజ్ - 1 ఐకాం ఎదురుగా చర్లపల్లిలో 1996 సం॥లో "ద హోంఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్" అనే విద్యార్థుల వసతి గృహము స్థాపించబడినది. ఈ సంస్థ నగరంలోని దాతల సహకారంతో నడుపబడుచున్నది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే బాగా చదువగలిగి ఉండి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసేవారిని కూలీలుగా కార్మికులుగా మారకుండా సమాజానికి పనికివచ్చే మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని. గ్రామీణ పేద విద్యార్థులకు హైదరాబాద్ నగరంలో ఉండి చదువగలిగే ఆర్థిక స్తోమత లేనివారికి వసతి, బోజనం, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు. బస్‌పాస్ మరియు పరీక్షఫీజులు కూడా చెల్లించి వారి భావి జీవితము అత్యున్నతంగా ఉండేలా తీర్చిదిద్దాలని మా ఆశయం.

ఇందులో అడ్మిషన్ పొందగలిగే విద్యార్థులకు కులము. మతము పట్టింపులు ఏమీ ఉండవు. ఇందులో చదువుకోదలచిన విద్యార్థులకు నగరంలో ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొంది ఉండపలెను మంచి మార్కులు వచ్చిన అనాథ విద్యార్థులకు తల్లి లేదా తండ్రి లేనివారికి గ్రామీణ పేద విద్యార్థులకు మేనేజ్‌మెంట్ తరవున కళాశాల యాజమాన్యంతో సంప్రదించి వీలైతే ఏదైనా మంచి కళాశాలలో ఫ్రీ అడ్మిషన్ ఇప్పించుటకు మా వంతు కృషి చేయగలము.

ఈ సంస్థ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇందులో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననల్ని పొందుచున్నారు సుమారు 400 మంది గత 29 సం॥లలో ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు

ఇందులో అడ్మిషన్ కోరకై విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి (ఇంటర్ 1. 2. ఏదైనా డిగ్రీ ఫస్ట్ ఇయర్‌వారు) దరఖాస్తుకు అర్హులు గ్రామీణ అనాథ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులు. పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. విద్యార్థులు తమ మార్కులకు సంబంధించిన మెమో. అదే విధంగా బోనోఫైడ్ సర్టిఫికేట్స్ (ప్రస్తుతం చదువుతున్న కళాశాలకు సంబంధించినది), తల్లిదండ్రులు లేనిచో మరణ ధృవీకరణ పత్రము ఆదాయం సర్టిఫికేట్ (ఎం.ఆర్.ఓ. గారిచే ధృవీకరించబడినది అయి ఉండాలి). అన్ని సర్టిఫికేట్స్ యొక్కజిరాక్స్ కాపీలను మరియు రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలను పోంత చిరునామా కలిగిన స్టాంపులు అంటించి కవరును పోస్టు ద్వారాగాని. ఇమెయిల్ ద్వారాగాని. వాట్సప్ (9391221697) ద్వారాగాని. స్వయంగా గాని పైన ఉన్న చిరునామాకు వెంటనే పంపించగలరు. పూర్తి వివరాలకుపైన నెంబర్లకు సంప్రదించగలరు.

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అడ్రస్ కొరకు SCAN చేయండి

మనవి : కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చదువుకునే పదవతరగతిలో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులను ప్రోత్సహించి మా హోం కు పంపించగలరు.

గమనిక: ఈ వసతి కేవలం బాలురుకు మాత్రమే

Bittu Digitals Aler - 8919441120


## గ్రామ పంచాయతీలకు మహర్దశ

### 15వ ఆర్థిక సంఘం నిధులకు లైన్ క్లియర్

హైదరాబాద్, జనవరి 14,నవతరం: గ్రామ పంచాయతీలకు మహర్దశ.. 15వ ఆర్థిక సంఘం నిధులకు లైన్ క్లియర్ కానుంది. తెలంగాణ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లకు శుభవార్త అందించింది. గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు, సుమారు రూ.2500 కోట్లు విడుదల చేయడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ నెలాఖరులోగా కనీసం రూ.వెయ్యి కోట్లు, మిగిలిన నిధులను వచ్చే నెలలో విడుదల చేయనున్నట్లు సమాచారం. నిధుల వినియోగంలో డిజిటల్ ప్రక్రియ తప్పనిసరి చేస్తూ, ప్రతి గ్రామపంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను పీఎఫ్?ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.





## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటిక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.



A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.


అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు.

For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697




# పటాన్ చెరువు నియోజకవర్గం బీరంగూడ గుట్టపైన
# అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం




పటాన్ చెరువు నియోజకవర్గం నవతరం :- సంగారెడ్డి జిల్లా పటాన్చెరు స్వామి దేవాలయం నియోజకవర్గం పరిధిలోని బీరంగూడ గుట్ట పైన నిర్మించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం మొదటి స్లాబ్ నిర్మాణ పనులను బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభించిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న దేవాలయ నిర్మాణ పనులలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. నేటి తరం యువత భక్తి భావం పెంపొందించుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. హాజరైన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
### ఎం డి ఆర్ ఫౌండేషన్
### ఆధ్వర్యంలో ఘనంగా రంగోలి, కైట్ ఫెస్టివల్




పటాన్ చెరువు నవతరం :- తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పర్వదినం అని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రంగోలి, కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల ఎం డి ఆర్ ఫౌండేషన్ ను అభినందించారు. తన బాల్యంలో సంక్రాంతి వచ్చిందంటే పండగ ముందు పండగ తర్వాత గాలిపటాలు ఎగురవేస్తూ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే వారమని.. నేటితరం సెల్ ఫోన్, సోషల్ మీడియా మాయలో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో
# సుఖసంతోషాలు నింపాలి : నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరువు నవతరం : తెలుగు ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించుకునే మకర సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం భోగి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ లో యువకులతో కలిసి ఆయన గాలిపటాలును ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు,గాలి పటాల సందడితో కనువిందు చేసే సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఈ సంక్రాంతి ప్రతిఒకరి జీవితాల్లో నూతన కాంతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.. ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా, పసిడి పంటలతో పరిఢవిల్లాలని భగవంతుడిని వేడుకున్నానన్నారు. చిన్నారులు ఎగురవేసే పతంగుల పట్ల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు..



## అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నాం

### ::: టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్



హైదరాబాద్, నవతరం: జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్ లను అర్ధ రాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని టీయూడబ్ల్యూ జే పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాము. జర్నలిస్టులు గానీ, ఆ వార్త సంస్థ గాని నిరాధారమైన, అసత్య వార్త కథనాలు రాస్తే ఆ విషయంలో ఖండన కోరుకోవచ్చు అప్పటికీ వారు స్పందించకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకోవచ్చు కానీ, ఇలా అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారిని అరెస్టు చేయడం సరైంది కాదు. ఈ ముగ్గురూ జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులు. వీరి అరెస్టును తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుంది. ఇదే సమయంలో జర్నలిస్టులకు సంఘం తరఫున ఒక సూచన కూడా చేస్తున్నాము. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల విషయంలో నిరాధారమైన వార్తలను ప్రసారం గాని, ప్రచురించవద్దని, ఆధారాలు ఉంటేనే వార్తలు వేయాలని, ముఖ్యశీగా ఎవరి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వార్త కథనాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా మీడియా సంస్థలదే. ఏది ఏమైనా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం అర్ధరాత్రి పూట తీవ్రవాదుల అరెస్టు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదు. వెంటనే ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకొని అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు టీయుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్.

## తెలంగాణ పోలీసులపై
## ఎన్ టివి మహిళా జర్నలిస్ట్ దేవీ ఆగ్రహం

### నేను కేవలం వార్త చదివాను..
### ఏ వార్త వచ్చినా అది నేను చదువుతాను
### మహిళలకు అవమానం జరిగింది అంటున్నారు
### మరి నేను కూడా ఒక మహిళా జర్నలిస్టునే కదా!



హైదరాబాద్, జనవరి 14,నవతరం: తెలంగాణ పోలీసులపై ఎన్ టివి మహిళా జర్నలిస్ట్ దేవీ ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నేను కేవలం వార్త చదివాను.. ఏ వార్త వచ్చినా అది నేను చదువుతాను , నా వృత్తి ధర్మంలో భాగంగానే వచ్చిన వార్తను చదివానని, 3 గంటల పాటు నన్ను విచారించారు.. నాకు ఎంత మెంటల్ హెరాస్మెంట్ ఉన్నా సమాధానాలు చెప్పాను, నిన్న వాళ్లు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాను, అయినా మళ్లీ అర్ధరాత్రి నా ఇంటికి రావాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. మా ఇంటికి వచ్చి, మా ఇంట్లో వాళ్ళను ఇబ్బంది పెట్టారు. మేమి ఏమీ దొంగలము కాదు, మహిళలకు అవమానం జరిగింది అంటున్నారు, మరి నేను కూడా ఒక మహిళా జర్నలిస్టునే కదా, నన్ను ఎందుకు వేధిస్తున్నారాని ఎన్ టివి జర్నలిస్ట్ దేవి తెలిపారు.

## అప్పుడొక న్యాయం...
## ఇప్పుడొక న్యాయమా...?

### ::: ఇక్బాల్ కురేషీ, ఇంక్విలాబ్ టీవీ బాస్

హైదరాబాద్, నవతరం: అవినీతిని, భూ స్కామ్ ని వెలుగులోకి తెచ్చినందుకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా జర్నలిస్ట్ రఘును నడిరోడ్డుపై నుండి ఎత్తుకెళ్లింది ఈ తెలంగాణ పోలీసులే కాకపోతే అప్పుడు పాలకులు వేరు. అర్ధరాత్రి తలుపులు విరగ్గొట్టి, బెడ్ రూమ్ లోకి జొరబడి రేవంత్ రెడ్డిని ఎత్తుకెళ్లింది ఈ తెలంగాణ పోలీసులే కాకపోతే అప్పుడు పాలకులు వేరు. తెలంగాణ ఉద్యమ వీరుడు జేఏసీ చైర్మన్, వృద్ధుడు కోదండరాం ని అయన ఇంటి తలుపులు విరగ్గొట్టి ఎత్తుకెళ్లింది ఈ తెలంగాణ పోలీసులే కాకపోతే అప్పుడు పాలకులు వేరు. ఇంకా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి అప్పటి పాలకులే చెప్పిందే పోలీసులు చేశారు. ఇప్పుడు పాలకులు చెప్తుంది చేస్తున్నారు ఆ తెలంగాణ పోలీసులే అధికారులు సిబ్బంది మారలేదు పాలకులు మాత్రమే మారారు. అప్పుడు తప్పు కానిది ఇప్పుడు తప్పెట్లా అవుతుంది. ఇప్పుడు పోలీసులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటే అప్పుడు టీఆర్ఎస్ / బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారా. అప్పుడు జర్నలిస్ట్ రఘు చేసింది తప్పైతే ఇప్పుడు ఎన్ టీవీ జర్నలిస్టులు చేసింది కూడా తప్పే. ఒకవేళ ఎన్ టీవీ జర్నలిస్టులు చేసింది తప్పుకాదని అంటున్న టీఆర్ఎస్ / బీఆర్ఎస్ నాయకులు అన్యాయంగా జర్నలిస్ట్ రఘుని అరెస్ట్ చేయించినందుకు ముక్కు నెలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పి అప్పుడు ఎన్ టీవీ జర్నలిస్టులు చేసింది తప్పుకాదని సమర్ధించండి.



## ప్రాణం తీసిన చైనా మాంజా

### ::: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గొంతు కోసి మృతి

సంగారెడ్డి, జనవరి 14,నవతరం: సంగారెడ్డి జిల్లాలోని ఫసల్వాది ప్రాంతంలో చైనా మాంజా ఓ వ్యక్తి ప్రాణం తీసింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గొంతుకు చైనా మాంజా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడిని బిహార్ రాష్ట్రానికి చెందిన అద్వైక్‌గా పోలీసులు గుర్తించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చైనా మాంజా వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ముగ్గుల పోటీ నిర్వహించిన మాద్రి పృధ్వీరాజ్








సంగారెడ్డి, నవతరం: పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మాద్రి పృథ్వీరాజ్ సమక్షంలో సంప్రదాయ ముగ్గుల పోటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కళాత్మక ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి హాజరై, పోటీలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, విజేతలకు బహుమతులు అందజేశారు. సమాజంలో సాంస్కృతిక విలువలను కాపాడేందుకు ఎండీఆర్ ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా సంక్రాంతి పండుగ సంబరాలు








కుత్బుల్లాపూర్, నవతరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హెచ్ఎంటీ మైదానంలో బీజేవైఎం, సోషల్ మీడియా విభాగాల ఆధ్వర్యంలో పతంగుల పండుగ (కైట్ ఫెస్టివల్) అత్యంత ఉత్సాహంగా జరిగింది. అసెంబ్లీ బీజేవైఎం, సోషల్ మీడియా నాయకులు ఒక్కంటి దయాకర్, సతీష్ రంగంపేట, సాయి జైవంథ్ సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంబరాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొల్లి మాధవి రాష్ట్ర ఉపాధ్యక్షులు, డాక్టర్ ఎస్. మల్లారెడ్డి జిల్లా ఇంచార్జి అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సంబరాల్లో జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, భావిగడ్డ రవి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, రావుల శేషగిరి, శేఖర్ యాదవ్, ఎం.ఎస్. వాసు, కళ్యాణి,సుమన్ రావు, కళ్యాణ్ చక్రవర్తి, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, విజేందర్ రెడ్డి, కట్ట కుమార్, భిక్షపతి యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పత్తి సతీష్, ఎస్ మహేందర్, సురేష్ గౌడ్, దీపక్ అంబేకర్ పాల్గొన్నారు. బీజేవైఎం నాయకులు మణి, శ్యామ్ కిరణ్ రెడ్డి, విజయ్, రాజా మహేంద్ర, సాయికృష్ణ, అశోక్ నాయక్, కార్తీక్ తో పాటు సోషల్ మీడియా సభ్యులు నాగరాజు, ప్రశాంత్, మరియు రమేష్ మాసాని, సైదులు, వసంత్ కుమార్, రోహిత్, నరేష్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సందడి చేశారు. ?ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. మల్లారెడ్డి మాట్లాడుతూ... "వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సంక్రాంతి పండుగను ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలి. పతంగులు ఎగురవేసే సమయంలో పక్షులకు, ప్రజలకు ప్రాణాపాయం కలిగించే చైనీస్ మాంజాను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు." రంగురంగుల పతంగులతో హెచ్ఎంటీ మైదానం కోలాహలంగా మారింది. సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకుంటూనే, సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.





# అడిగేది ఎవరు సర్వే నం. 261 ఆక్రమించేదం

**ప్రభుత్వ భూమిని కాపాడండి అంటున్న మాజీ సర్పంచ్ మురళి.. కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**గుమ్మడిదల మున్సిపాలిటీ లో గల అన్నారం సర్వేనెంబర్ 261 లో భూములు అన్యాక్రాంతం**

**ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు.. గుమ్మడిదల మున్సిపాలిటీ కమిషనర్ కు కాంప్లెట్ చేసిన పట్టించుకోని మున్సిపల్ కమిషనర్**

**ఇప్పుడు నేను ఏం చేయలేను అంటున్న గుమ్మడిదల మున్సిపాలిటీ కమిషనర్ దశరథ్.. అధికారుల నిర్లక్ష్యం**

గుమ్మడిదల మున్సిపాలిటీ నవతరం : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం లో 261 సర్వే నంబర్లు గల ప్రభుత్వ. రైతుల పట్టాల భూములు కబ్జాదారులు రౌడీలతో భయపెట్టిసు లాక్కుంటున్నారు ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ సిబ్బంది నిద్రమత్తులో ఉన్నారు తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టడంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు రౌడీలను బందోబస్తు ఏర్పాటుచేసి నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారం మాజీ సర్పంచ్ మురళి తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం అన్నారంలో కబ్జాదారులు పోతున్నారని అన్నారు అధికారులు దీనిపై దృష్టిపెట్టాలని కబ్జా లా చెరువు నుండి ప్రభుత్వ రైతుల భూములను కాపాడాలని కోరారు. ప్రభుత్వ భూములు రైతుల భూములు దౌర్జన్యంగా లాక్కుంటున్నారు ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగుతున్నారు కబ్జాదారుల నుండి మేము భయా ప్రాంతాలకు ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్న కబ్జాదారులు.



## హైదరాబాద్‌లోని కార్ల షోరూంలో భారీ అగ్ని ప్రమాదం

### అల్వాల్‌లోని ట్రూ వ్యాల్యూ కార్ల షోరూంలో చెలరేగిన మంటలు

సికింద్రాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అల్వాల్‌లోని ట్రూ వ్యాల్యూ కార్ల షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే స్పందించిన కార్ల షోరూం సిబ్బంది, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రెండు ఫైరింజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా నల్లటి పొగతో కమ్ముకుపోయింది. ఈ దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

# జర్నలిస్టుల అరెస్ట్ అప్రజాస్వామికం

### ::: డా. నర్సింలు ఎల్లంపల్లి, సీనియర్ జర్నలిస్ట్



హైదరాబాద్, నవతరం: రాష్ట్ర కేబినెట్ లోని మంత్రిపై ఎన్ టీవీ మీడియాలో ప్రసారమైన కథనంలో భాగంగా సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ ను అరెస్ట్ చేయటాన్ని సీనియర్ జర్నలిస్ట్, నవతరం తెలుగు దినపత్రిక బ్యూరో చీఫ్ డాక్టర్ నర్సింలు ఎల్లంపల్లి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'సిట్ట ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం సదరు జర్నలిస్టులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్ట్ చేయటం సరికాదన్నారు. జర్నలిజంలో మూడు దశాబ్ధాల కాలంగా పని చేస్తున్న సదరు జర్నలిస్టులిపై కేసులు నమోదు చేయటం వెనక భయంకరమైన కుట్ర ఉన్నట్లు కనిపిస్తోంది, సమాజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే సదరు జర్నలిస్టులు... తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారన్నారు. బహుజన వర్గాలకు చెందిన జర్నలిస్టులను సిట్ అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

# సీనియర్ జర్నలిస్టుల అరెస్ట్ సరికాదు

### ::: ఎర్ర యాకయ్య, ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు - కూకట్పల్లి



హైదరాబాద్, నవతరం: రాష్ట్ర కేబినెట్ లోని మంత్రిపై ఎన్ టీవీ మీడియాలో ప్రసారమైన కథనంలో భాగంగా సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్ ను అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్, కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్, భాగ్య నగర్ జర్నలిస్ట్ అసోసియేషన్, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించాయి. 'సిట్ట ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం సదరు జర్నలిస్టులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్ట్ చేయటం సరికాదు. జర్నలిజంలో 3 దశాబ్ధాలుగా పని చేస్తున్న ఈ ముగ్గురు జర్నలిస్టులిపై కేసులు నమోదు చేయటం వెనక కుట్ర ఉన్నట్లు కనిపిస్తోంది. సమాజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే సదరు జర్నలిస్టులు... తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి పోరాటం చేశారు. బహుజన వర్గాలకు చెందిన జర్నలిస్టులను సిట్ అరెస్ట్ చేయటాన్ని తెలంగాణ ఖండిస్తున్నామని కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య ఓ ప్రకటనలో తెలిపారు.



# చైనా మాంజా వాడకండి

### ::: పతంగుల పంపిణీ అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ సూచన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, నవతరం: శామీర్ పేట నివాసంలో కైట్ పంపిణీ చేసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు ఎంపీ ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలోనే ప్రాచీన నాగరికత కలిగిన దేశం భారతదేశం. ప్రకృతిని ఆరాధించే సంస్కృతి మనదేశంలో మాత్రమే ఉంది. పూలను పూజించే పండుగ మన బతుకమ్మ. సంక్రాంతి చలికాలంలో వస్తుంది. ఈ కాలానికి అనుగుణంగా వంటలు ఉంటాయి. ఐక్యత మానవసంబంధాలు పరిపుష్టి కావడంలో.. మన సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు అందించడంలో ఈ పండుగలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. సంక్రాతి సందర్భంగా పతంగ్ లు ఎగురవేస్తారు. వారందరికీ సూచన.. జాగ్రత్తగా ఉండండి. బిల్డింగ్ పైన కరెంటు తీగలకు, స్తంభాలకు దూరంగా ఉండండి. ప్రమాదాలు జరగకుండా చూసుకోండి. చైనా మాంజ ఎట్టి పరిస్థితుల్లో వాడకండి. పండుగంటే సంతోషంగా జరుపుకోవాలని ప్రమాదాలను కొని తెచ్చుకోకూడదు అని ఈటల రాజేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కాంతారావు, మల్కాజిగిరి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కళ్యాణ్ చక్రవర్తి, మీడియా కన్వీనర్ సుమన్ రావు, బిక్షపతి, వేణు, నటరాజ్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



**ఎన్టీవీ భుజంపై తుపాకీ పెట్టి మీడియాను సీఎం రేవంత్ రెడ్డి భయపెడుతున్నారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేసి వికృతానందం పొందుతున్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులు టెర్రరిస్టులా..? ప్రజాస్వామ్యానికి ఇది మంచిది కాదు.. మీడియాని రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు. -నవతరం, హైదరాబాద్**

## తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదైంది. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత రవి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తలసాని మాట్లాడారు. "సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తాం" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, తలసాని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వివాదం ముదరడంతో తలసాని శ్రీనివాస్ యాదవ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కేవలం ఆవేశంలోనే ఆ మాటలు అన్నానని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని వివరణ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని తాను గౌరవిస్తానని తెలిపారు. అయినప్పటికీ, కాంగ్రెస్ నేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడతామని తలసాని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# డీమార్ట్ డిస్కౌంట్ల వెనుక అసలు కథ ఇదే..

## :: ఆ బిజినెస్ సీక్రెట్ తెలిస్తే షాక్ అవడం పక్కా

**డిమార్ట్.. దీని నగరాల్లో దీని పేరు తెలియని వారు సామాన్యంగా ఉండదరు. సమాన్యుడికి సరసమైన ధరకే సరుకులను అందించే ఈ సూపర్ మార్కెట్ గురించి చాలా మందికి తెలియని కొన్ని ఆసక్తికర విషయాలు ఇప్పుడు మీకు చెప్పబోతున్నాం. అవును డీమార్ట్ సరుకుల ధరలు ఎందుకు అంత తక్కుగా ఉంటాయో మీరెప్పుడైనా ఆలోచించారా? మిగతా మార్కెట్‌లలో పోలిస్తే డీమార్ట్ ఎందుకు అంత తక్కువకు సరకులను అందిస్తుంది. దీని వెన ఉన్న రహస్యం ఏంటో తెలుసుకుందాం పదండి**




హైదరాబాద్, జనవరి 14,నవతరం స్పెషల్: డిమార్ట్ ప్రస్తుతం భారతదేశంలో మధ్యతరగతి కుటుంబాలకు అత్యంత విశ్వసనీయమైన సూపర్ మార్కెట్‌లో ఒకటి. చిన్న మ్యాగీ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, ఇలా ఇంట్లోకి ఏ నిత్యావసర వస్తువుల కావాలన్నా డిమార్ట్ వెళ్లాల్సిందే. ఎందుకంటే అక్కడ ప్రతిదానిపై మన డిస్కౌంట్ లభిస్తుంది.. ఇతర మార్కెట్‌లో పోల్చుకుంటే అక్కడ తక్కువ ధరకు సరుకులు దొరుకుతాయి. ఉదాహరణకు, డి మార్ట్ రూ.149 విలువైన పాల ఉత్పత్తులను ఆఫర్ కింద రూ.99లకే పొందచ్చు. అలానే రూ. 99 ఉన్న మ్యాగీని రూ.73కి విక్రయిస్తుంది. అందుకే చాలా మంది డీమార్ట్ వెళ్లి షాపింగ్ చేస్తారు. ఈ ఆఫర్‌ల కారణంగా డీమార్ట్ ఇతర మార్కెట్‌లను వెనక్కి నూకి టాప్‌లో ఉంటుంది

తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు, అయితే ఇక్కడ చాలా మందికి వచ్చే డౌట్ ఏమిటంటే..తక్కువ ధరకే సరుకులు ఇవ్వడం ద్వారా డీమార్ట్‌కు నష్టాలు రావా అని.. చాలా మందికి తెలియన విషయం ఏమిటంటే.. డీ మార్ట్ అనే కంపెనీ ఎక్కువ లాభం పొందడం కంటే తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు చేయడంపై దృష్టి పెడుతుంది. డి మార్ట్‌లో రోజువారీ నిత్యావసర వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతాయి. దీంతో స్టాక్‌ను త్వరగా అమ్మివేసి, దాని పెట్టుబడిపై త్వరగా రాబడిని పొందుతుంది. ఇక్కడ మీరు తెలుసుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, డీమార్ట్ కంపెనీ సరఫరాదారులతో వ్యవహరించే విధానం. సాధారణంగా ఇతర రిటైల్ కంపెనీలు విక్రేత బిల్లులను క్లియర్ చేయడానికి టైం తీసుకుంటారు. కానీ డీమార్ట్ మాత్రం ప్రతి నెలా బిల్స్ క్లియర్ చేస్తుంది. దీంతో తయారీ దారుకుల కూడా కాస్తా తక్కువ ధరకే డీమార్ట్‌కు వస్తువుల సరఫరా చేస్తారు. అలాగే ఒకేసారి బల్క్‌లో వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా కంపెనీకి భారీ లభిస్తుంది.

**ఖర్చుల విషయంలో జాగ్రత్తలు..**

డి మార్ట్ తన ఖర్చుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. డిమార్ట్ ఎక్కువగా సొంతం స్థలంలోనే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసుకుంటుంది. ఎక్కడైనా రెంట్ తీసుకోవాల్సి వాటిని దీర్ఘకాలిక లీజులకు తీసుకుంటుంది. అందుకే ఖాళీ షెటర్‌లను అద్దెకు ఇస్తుంది.తద్వారా, అద్దె ఖర్చు తగ్గుతుంది. డి మార్ట్ ఖరీదైన ఇంటీరియర్స్, భారీ ఎయిర్ కండిషనింగ్, మ్యూజిక్ సిస్టమ్స్ మొదలైన వాటిపై పెద్దగా ఖర్చు చేయదు దాని వల్ల ఆదా చేసిన డబ్బును డిస్కౌంట్ల రూపంలో కస్టమర్లకు అందిస్తుంది.

**డీ-మార్ట్ ఓనర్ విజన్, అనుభవం..**

డిమార్ట్ ఇంత సక్సెస్ కావడానికి మెయిన్ రీజన్.. ఈ కంపెనీ యజమాని అయిన రాధాకిషన్ దమానికి ఉన్న అనుభవం. స్టాక్ మార్కెట్లో తాను సంపాదించిన అనుభవాన్ని రిటైల్ రంగంలో ఉపయోగించుకుని అతను డీమార్ట్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చారు. కేవలం ఒక్క స్టోర్‌తో ప్రారంభమైన అతని ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా వందలాది స్టోర్‌లకు చేరుకుంది. మొత్తంగా చూసుకుంటే తక్కువ ఖర్చులు, త్వరితగత చెల్లింపులు, నిత్యావసరాలపై దృష్టి పెట్టడంతో డి-మార్ట్ ప్రజలకు తక్కువ ధరలతో సరుకులను అందించగలుగుతుంది.

# కూకట్పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్

## ::: నల్లచెరువులో పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్







కూకట్పల్లి, నవతరం: కూకట్ పల్లి నల్ల చెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగులు ఎగురవేయడంతో అందరిలో జోష్ కనిపించింది. తన బాల్య, యవ్వన జీవితాన్ని గుర్తుకు తెచ్చుకొని పిల్లలు, యువకులతో కలసి పతంగిని ఎగురవేశారు. స్థానికుల ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ కూకట్పల్లి నల్ల చెరువు చెంత కైట్ ఫెస్టివల్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 సెప్టెంబరులో ఇక్కడ చెరువు విస్తరణ చేపట్టినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని.. నేడు పండగ వాతావరణం నెలకొందని అన్నారు. కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్ల చెరువును 30 ఎకరాలకు విస్తరించామన్నారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు మురికిని వదిలించామన్నారు. చెరువు లోతును పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు చెక్ పెడుతున్నామన్నారు. పై మెరుగులు దిద్దడం కాకుండా చెరువుల అభివృద్ధి అంటే యిలా ఉండాలని నిరూపించామన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉందని.. మరిన్ని అందాలు సమకూర్చుతున్నామని చెప్పారు. ఇక్కడకు 5 కిలోమీటర్ల నుంచి వచ్చి వాకింగ్ చేస్తున్నట్టు పలువురు చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. షటిల్ కోర్టు,కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ యిలా అనేక క్రీడలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**మరో 14 చెరువులను తీర్చిదిద్దుతాం**

హైడ్రా మొదటి విడత 6 చెరువులు అభివృద్ధి చేయగా ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని.. మరో 3 చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. వీటికి తోడు మరో 14 చెరువుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని.. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. యిలా నగరంలో 100 చెరువులు అభివృద్ధి జరిగితే చాలావరకు వరదలను నియంత్రించవచ్చు అని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చుతున్నామని.. దీంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా మంచి నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. మొత్తమ్మీద చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. చెరువును ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తారని తాము ఊహించలేదని.. ఇప్పుడు చూస్తే ఎంతో సంతృప్తిగా ఉందని అక్కడి నివాసితులు చెప్పారు. దుర్గంధభరితమైన వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన హైడ్రాకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వాకింగ్ ద్వారా మా ఆరోగ్యాలను మెరుగు చేసుకుంటున్నామని చెప్పారు. చిన్నపిల్లలు అందరూ కలసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్థానికులకు హైడ్రా కమిషనర్ మిఠాయిలు పంచారు.

# తెలంగాణలో తగ్గుముఖం పట్టిన చలి

**రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలు**

**సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు అధికం.. ముగిసిన 'కోల్డ్‌వేవ్ 2.0'**

**వచ్చే పది రోజులు పొడి వాతావరణం.. మళ్లీ తిరుగుతున్న ఫ్యాన్లు..**

**సంగారెడ్డి, కామారెడ్డి సరిహద్దుల్లో తేలికపాటి వర్ష సూచన**



తెలంగాణను గత నెల రోజులుగా గజగజ వణికించిన చలి తీవ్రత ఒక్కసారిగా తగ్గిపోయింది. సాధారణంగా శివరాత్రి వరకు కొనసాగాల్సిన చలి ఈసారి సంక్రాంతి ముందే కనుమరుగవుతోంది. ఎముకలు కొరికే చలిగాలుల స్థానంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలకు చలి నుంచి ఉపశమనం లభించినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల వరకు పెరిగాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేడు పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 31 డిగ్రీలకు చేరే అవకాశం ఉంది. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు మళ్లీ ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'కోల్డ్‌వేవ్ 2.0' (రెండో దశ చలిగాలులు) ముగిసిందని వాతావరణ నిపుణులు తెలిపారు. వచ్చే వారం పది రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో ఉంటాయని, తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొంటుందని అధికారులు వివరించారు. మరోవైపు, ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌లో వాతావరణం స్వల్పంగా మారనుంది. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని బీదర్ సరిహద్దు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత కొంత ఉన్నప్పటికీ, పగటి పూట మాత్రం సాధారణ వేడి కొనసాగనుంది. గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల పగటిపూట పొడి వాతావరణం ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల మధ్యాహ్న సమయాల్లో ఎండ ప్రభావం కొంత అధికంగా అనిపించే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు.

# పిల్లలపై లైంగిక వేధింపుల వీడియోలు

## ::: యూట్యూబర్ కంబేటీ సత్యమూర్తి అరెస్టు



హైదరాబాద్, నవతరం: బాలలపై లైంగిక వేధింపుల వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమ వేదికల్లో అప్‌లోడ్ చేసి, ప్రసారం చేసిన ఆరోపణలపై ఓ యూట్యూబర్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని విశాఖపట్నంలోని విశాలాక్షినగర్‌కు చెందిన కంబేటి సత్యమూర్తి (39) గా గుర్తించారు. ఇతడు వైరల్ హబ్ అనే యూట్యూబ్ ఛానెల్‌ను నిర్వహిస్తూ.. అభ్యంతరకరమైన, పిల్లలపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు. ఈ వీడియోల్లో 18 ఏళ్ల లోపున్న మైనర్ల ఇంటర్వ్యూలు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. వీటిలో నిందితుడు కావాలనే పిల్లలను అసభ్యకరమైన, లైంగికపరమైన అశ్లీల ప్రశ్నలు అడగటమే కాకుండా.. మైనర్లు ముద్దులు పెట్టుకునేలా ప్రేరేపించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. 2025 అక్టోబరు 16న వైరల్‌హబ్ యూట్యూబ్ ఛానల్‌లో పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు ప్రసారం అవుతున్నట్లు గుర్తించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. సాంకేతికపరమైన దర్యాప్తులో సత్యమూర్తిని నిందితుడిగా గుర్తించారు. అతడు 2018 నుంచి యూట్యూబర్‌గా పనిచేస్తూ.. వైరల్‌హబ్007 అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లూయెన్సర్లతో అసభ్య భాషలో ఇంటర్వ్యూలు చేసి, వ్యూస్ పెంచుకొని ఆదాయం పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వీడియోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతడు బాలల రక్షణ చట్టాలు, సైబర్ చట్టాన్ని ఉల్లంఘించాడని చెప్పారు. సైబర్ ఏసీపీ శివమారుతి పర్యవేక్షణలో ఎస్ఐ సురేశ్ తమ బృందంతో కలిసి నిందితుడు సత్యమూర్తిని వైజాగ్‌లో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

# ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్టు చేయడం అప్రజాస్వామికం

## ::: గోషామహల్ బిఆర్ఎస్ నేత ఆనంద్ కుమార్‌గౌడ్



గోషామహల్, నవతరం: ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిరంతరం ప్రజా సమాజ శ్రేయస్సుకోసం పాటుపడే జర్నలిస్టులను అర్ధరాత్రి వేళలో అరెస్ట్ చేయడాన్ని గోషామహల్ బిఆర్ఎస్ నేత ఆనంద్ కుమార్ గౌడ్ ఖండించారు. ఎలాంటి విచారణ జరపకుండా అర్ధరాత్రి వేళల్లో ఇళ్లలోకి చొరబడి జర్నలిస్టులను అక్రమంగా అరెస్టులు చేసి, కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురయ్యే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వార్తల ప్రసారంలో అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం పాత్రికేయులపై కక్ష గట్టి, ఇష్టానుసారంగా వ్యవహరించ డం సమంజసం కాదన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. తమది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా ప్రభుత్వ అధికారులు అనుసరిస్తున్న నిరంకుశ ధోరణి అరికట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. మూడు దశాబ్దాలుగా జర్నలిజంలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం వెనుక ప్రభుత్వ పెద్దల కుట్ర ఉందేమోనన్న సందేహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు నక్సలైట్లు కాదని, రౌడీ షీటర్లు, బ్లాక్ బ్లాక్మెయిలర్లు కాదని అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి జర్నలిస్టులను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టులకు మద్దతు గా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జర్నలిస్టులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.



# ఎన్టీవీ జర్నలిస్టులకు షరతులతో బెయిల్ మంజూరు

హైదరాబాద్, నవతరం: అందరిదీ ఒకటే మాట. పోలీసులు.. జర్నలిస్టులను టార్గెట్ చెయ్యడమేంటి అని. పోలీసులు ఏం చెయ్యాలో అది చెయ్యకుండా.. జర్నలిస్టులపై పడటమేంటి అని రాజకీయ నేతలు ప్రశ్నిస్తున్నారు. పోలీసుల తీరును తీవ్రంగా తప్పుపడుతున్నారు. తెలంగాణలో రాజకీయంగా, మీడియా వర్గాల్లో సంచలనం రేపిన ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ కేసులో మరో కీలక పరిణామం జరిగింది. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్ సుధీర్‌లను పోలీసు కస్టడీ (రిమాండ్)కి ఇవ్వాలని సీసీఎస్ పోలీసులు చేసిన అభ్యర్థనను నాంపల్లి క్రిమినల్ కోర్టు తిరస్కరించింది. అదే సమయంలో ఇద్దరు జర్నలిస్టులకు కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పుతో ఎన్టీవీ వర్గాల్లో ఉపశమనం వ్యక్తమవుతోంది. ఈ కేసు బ్యాక్‌గ్రౌండ్ ఏమిటంటే, గత జనవరి 8వ తేదీన ఎన్టీవీ ఛానెల్‌లో ప్రసారమైన ఒక వార్తా కథనం సంచలనం రేపింది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికీ, ఒక మహిళా ఐఏఎస్ అధికారిణికీ మధ్య సంబంధం ఉందని ఆ కథనంలో ఆరోపణలు చేశారు. ఇది వ్యక్తిత్వ హననం, దుష్ప్రచారమని భావించిన పోలీసులు ఎన్టీవీ మేనేజ్‌మెంట్, జర్నలిస్టులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా జనవరి 14వ తేదీ ఉదయం సీసీఎస్ పోలీసులు చర్యలు మొదలుపెట్టారు. దొంతు రమేష్ హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుటుంబ సభ్యులతో కలిసి బ్యాంకాక్ వెళ్లే సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు రిపోర్టర్లు సుధీర్, పరిపూర్ణా చారిని కూడా అరెస్ట్ చేశారు. ముగ్గురిని సీసీఎస్ కార్యాలయానికి తరలించి ప్రశ్నించారు. పరిపూర్ణా చారిని ప్రశ్నించి వదిలేశారు. మిగతా ఇద్దర్నీ వదల్లేదు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు.

# ఆంక్షలతో భారత ఓఎంసీలకు రిస్కేమీ లేదు

### వాటి మార్జిన్లపై ప్రభావం ఉండదు

### ఫిచ్ రేటింగ్స్ అంచనాలు

న్యూఢిల్లీ: రష్యన్ ఆయిల్ కంపెనీలైన రోజ్‌నెఫ్ట్, ల్యూక్ ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించడం, రష్యా చమురు ఆధారిత రిఫైనరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య (ఈయూ) నిషేధం విధించడం భారత ప్రభుత్వరంగ చమురు సంస్థల మార్జిన్లు, పరపతి సామర్థ్యాలపై పెద్దగా ప్రభావం ఉండదని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. అయితే, ఈ ఆంక్షలు ఎంత కాలం పాటు కొనసాగుతాయి, ఎంత కఠినంగా అవి అమలవుతాయన్న దాని ఆధారంగా తుది ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. 2025 జనవరి నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో భారత చమురు దిగుమతుల్లో మూడింట ఒక వంతు రష్యా నుంచే ఉండడం గమనార్హం. రష్యా డిస్కౌంట్ రేటుపై చమురును విక్రయించడంతో ప్రభుత్వరంగ చమురు సంస్థల లాభదాయకత గణనీయంగా మెరుగుపడింది. సాధారణంగా మధ్యప్రాచ్య దేశాలపై చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువగా ఆధారపడేది. కానీ, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగిన తర్వాత ఈ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో మార్కెట్ ధర కంటే తక్కువకే చమురును రష్యా ఆఫర్ చేయడంతో భారత కంపెనీలు అటువైపు మళ్లాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో అంతకుముందు రష్యా వాటా ఒక శాతంగా ఉంటే, 40 శాతానికి పెరిగింది.




**చమురు ధరలు తక్కువ స్థాయిలోనే..**

ప్రపంచ చమురు ఉత్పత్తి సామర్థ్యం తగినంత ఉండడం ధరలను అదుపులోనే ఉంచుతుందని, బ్రెంట్ బ్యారెల్ ధర 2026లో సగటున 65 డాలర్ల స్థాయిలో ఉండొొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపంది. 2025లో బ్రెంట్ బ్యారెల్ 70 డాలర్లుగా ఉండడాన్ని ప్రస్తావించింది. ఇక రష్యా చమురు ఆధారిత ఉత్పత్తులను ఈయూకి ఎక్కువగా ఎగుమతి చేస్తున్న భారత్‌లోని ప్రైవేటు చమురు సంస్థలు రిస్క్‌ను ఎదుర్కోవాల్సి రావొొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. మూడు ప్రభుత్వరంగ చమురు సంస్థల (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీ) ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్‌లు బలంగా ఉన్నట్టు తెలిపింది. ఎల్‌పీజీ సబ్సిడీల నష్టాన్ని ప్రభుత్వం ప్రకటించిన రూ.30వేల కోట్ల ప్యాకేజీతో గట్టెక్కొచ్చని పేర్కొంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్ 2025%-%26లో బ్యారెల్‌కు 6%-%7 డాలర్లు, 2026%-%27లో 6 డాలర్ల స్థాయిలో ఉండొొచ్చని అంచనా వేసింది.



## రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల వేలం: తొలిరోజే 59 ప్లాట్ల సేల్

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధ్వర్వంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలకు మరోసారి మంచి స్పందన వచ్చింది. నగర శివారు ఓఆర్ఆర్‌కు సమీపంలోని తొర్రూర్, కుర్మల్ గూడ, బహదూర్ పల్లి ప్రాంతాలలోని 163 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ బహిరంగ వేలంలో తొలి రోజున తొర్రూరులోని 59 ప్లాట్లకు వేలం నిర్వహించారు. ఈ విక్రయాల్లో అత్యధికంగా చదరపు గజానికి రూ. 39 వేల ధర పలికింది. మొత్తం మీద ఈ ప్రాంతంలో చదరపు గజానికి సగటున రూ. 28,700 ధర పలికింది. ఇక్కడి భూములకు కనీస ధర రూ. 25 వేలుగా నిర్ధారించి వేలం నిర్వహించారు. సోమవారం నాటి విక్రయాల ద్వారా మొత్తం రూ. 46 కోట్ల మేర ఆదాయం వచ్చిందని స్వగృహ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ వేలం పాటలో 110 మంది బిడ్డర్లు పాల్గొన్నారన్నారు. కాగా తొర్రూర్ ప్రాంతంలోని మిగిలిన 65 ప్లాట్లకు, కుర్మల్ గూడలోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లిలోని 13 ప్లాట్లకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.




## ఈవీలపై మెర్సిడెస్ బెంజ్ ఫోకస్

### కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్

హైదరాబాద్: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ క్రమంగా తన పంతాను మార్చుకుంటున్నది. లగ్జరీ కార్లతోపాటు విద్యుత్‌తో నడిచే వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని వాహనాలను విడుదల చేసినప్పటికీ ఇక నుంచి విడుదలయ్యేవాటిలో వీటికి అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ, ఏపీలలో ఈవీ కార్లకు ఆదరణ క్రమంగా పెరుగుతున్నదని, ఇది వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి దోహదం చేయనున్నదన్నారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఈవీల వినిమయం చాలా తక్కువగా ఉన్నదని, ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నదన్నారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్లోకి 40 కొత్త మాడళ్లను విడుదల చేయనున్నట్టు ప్రకటించిన ఆయన..వీటిలో కొన్ని దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు.మరోవైపు, ద్వితీయ శ్రేణి నగరాలతోపాటు తృతీయ శ్రేణి నగరాలపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఇటీవలకాలంలో మెట్రో నగరాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లోనూ లగ్జరీ కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయన్నారు.పూణెకు సమీపంలో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ సామర్థ్యం ఏడాదికి 20 వేల యూనిట్లు.ప్రస్తుతం భారత్‌లో సంస్థ 25 మాడళ్లను విక్రయిస్తుండగా, వీటిలో 11 దేశీయంగా తయారవుతుండగా, మిగతా మాడళ్లను దిగుమతి చేసుకుంటున్నది.ఈ ఏడాది కొత్తగా 16 టచ్‌పాయింట్లను ప్రారంభించింది. దీంతో టచ్‌పాయింట్ల సంఖ్య 140కి పైకి చేరుకున్నాయి.కంపెనీ మొత్తం వాహన విక్రయాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 15 శాతంగా ఉన్నది. అలాగే 10 విక్రయ కేంద్రాలు ఉన్నాయి.

## పెట్టుబడి లేకుండానే వ్యాపారం.. 'డబ్ల్యూకామర్స్' వెల్లడి

హైదరాబాద్: సరుకులు నిల్వ చేయాల్సిన అవసరం లేదు..అంతేకాదు పైసా పెట్టుబడి లేకుండానే వ్యాపారం చేయవచ్చునని డిజిటల్ కామర్స్ సేవల సంస్థ డబ్ల్యూకామర్స్ వెల్లడించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకొని చిరు వ్యాపారులు, వ్యక్తులు ఎవరైనా వ్యాపారం ప్రారంభించుకోవచ్చును. విక్రేతల పేరుతో కంపెనీ ఒక ఆన్‌లైన్ స్టోర్‌ను క్రియేట్ చేస్తున్నది. సోషల్ మీడియాలో ఈ ఆన్‌లైన్ స్టోర్‌కు సంబంధించి లింక్/క్యూఆర్‌కోడ్‌ను పోస్ట్ చేయడం లేదా బంధువులు, స్నేహితులకు షేర్ చేసిన చాలు. కంపెనీ ఆఫర్ చేసే ఉత్పత్తులను ఎవరు కొనుగోలు చేసినా..విక్రేతకు 20-40 శాతం వరకు లాభం రానున్నది. ఇలా బుకింగ్ చేసుకున్న వస్తువుల డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుందని డబ్ల్యూకామర్స్ కో-ఫౌండర్, సీవోవో శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22 వేలకు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయన్నారు. హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ ఎసెన్షియల్ విభాగాలకు చెందిన 40కి పైగా బ్రాండ్ నుంచి 600కి పైగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు.

## విస్తరణ దిశగా అల్ట్రావయొలెట్



బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్%-%47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి. చూడటానికి స్టైలిష్ డిజైన్ కలిగిన అల్ట్రా వయొలెట్ ఎలక్ట్రిక్ బైకులు.. ఎందుకుని వేరియంట్‌ను బట్టి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి చార్జి చేస్తే 323 కి.మీ. వరకు రేంజ్ ఉంటుంది. ఈ బైకులు ప్రస్తుతం దేశీయ విఫణిలో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా అమ్మకానికి ఉన్నాయి. ఇవి అత్యుత్తమ పనితీరును అందించడం వల్ల ఎక్కువమంది.. ఈ బైకులను ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు.

## టఫే ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌కు గుర్తింపు




జర్మనీలో నిర్వహించిన అగ్రిటెక్నికా 2025లో 'ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్' టాప్ 5 ఫైనలిస్టుల జాబితాలో తమ ఈవీ28 ఎలక్ట్రిక్ ట్రాక్టర్ చోటు దక్కించుకుందని టఫే ట్రాక్టర్స్ వెల్లడించింది. పర్యావరణహిత ట్రాక్టర్ల కేటగిరీలో ఈ గుర్తింపు దక్కించుకున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా తమ కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ ఈవీఎక్స్75 సహా మూడు ఉత్పత్తులను టఫే ప్రదర్శించింది. యూరోపియన్ రైతుల వైవిధ్యమైన అవసరాల కు ఇవి అనుగుణంగా ఉంటాయని సంస్థ వైస్ చైర్మన్ లక్ష్మీ వేణు తెలిపారు. వీటితో కేవలం ట్రాక్టర్ల తయారీ నుంచి అన్ని రకాల వ్యవసాయ సాధనాలును అందించే సమగ్ర సంస్థగా ఎదిగినట్లవుతుందని వివరించారు. సబ్%-%100 హెచ్‌పీ సెగ్మెంట్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చైర్మన్ మల్లికా శ్రీనివాసన్ చెప్పారు. స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తూ ప్రెసిషన్ అగ్‌టెక్, స్మార్ట్ ఫార్మింగ్, ఆటోమేషన్ మొదలైనవాటిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని వివరించారు.




# 3 కంపెనీలు రెడీ

### సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మూడు కంపెనీల దరఖాస్తులను ఆమోదించింది. ఈ జాబితాలో ఏస్‌వెక్టర్, సిల్వర్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్, స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ కంపెనీ చేరాయి. వీటిలో ఏస్‌వెక్టర్ 2025 జూలైలో గోప్యతా మార్గాన సెబీకి దరఖాస్తు చేసింది. సిల్వర్ కన్స్యూమర్, స్టీల్ ఇన్‌ఫ్రా ఈ ఏడాది ఆగస్ట్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2025)లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులవైపు పరుగు తీస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 92 కంపెనీలు మెయిన్‌బోర్డులో ఐపీవోకు వచ్చాయి. ఈ బాటలో మరికొన్ని కంపెనీలు ఈ నెలలోనే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సిద్ధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో 3 కంపెనీలకు సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం! వివరాలు చూద్దాం.. కునాల్ భల్, రోహిత్ బన్సల్ ఏర్పాటు చేసిన ఏస్‌వెక్టర్ రహస్య ఫైలింగ్ విధానంలో ఐపీవోకు అనుమతి పొందింది. ఇటీవల ఇదే మార్గంలో పలు దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూ వచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఈకామర్స్ సంస్థ స్నాప్‌డీల్ మాతృ సంస్థ అయిన ఏస్‌వెక్టర్.. సాస్ ప్లాట్‌ఫామ్ యూనికామర్స్‌సహా, కన్స్యూమర్ బ్రాండ్ బిల్డింగ్ సంస్థ స్టెల్లారో బ్రాండ్స్‌ను నిర్వహిస్తోంది. వీటిలో యూనికామర్స్ 2024లోనే లిస్టయిన సంగతి తెలిసిందే. పబ్లిక్ ఇష్యూ ద్వారా సిల్వర్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ రూ. 1,400 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 865 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మరో రూ. 35 కోట్లు అనుబంధ సంస్థ బీఏపీఎల్ రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధానంగా పంపులు, మోటార్లు, ఫ్యాన్లు, లైటింగ్ తదితర కన్స్యూమర్ ఎలక్ట్రికల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది. స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 96 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.42 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వడోదర, హైదరాబాద్, భిలాయ్‌లలోగల తయారీ ప్లాంట్ల విస్తరణతోపాటు.. వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.




## పెరిగిన బంగారం ధర..


### దిగివచ్చిన వెండి.. హైదరాబాద్‌లో ధరలు ఇవే..!

బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. బలమైన డిమాండ్ మధ్య బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల రూ.300 పెరిగి తులం రూ.1,29,700కి చేరింది. ఇక 22 క్యారెట్ల పసిడి సైతం రూ.300 పెరిగి రూ.1,29,100కి చేరుకుంది. మరో వైపు వెండి దిగివచ్చింది. రూ.1000 తగ్గి కిలోకు రూ.1,63,800కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ఔన్సుకు 4,077.35 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది. వెండి ఔన్సుకు 0.66 శాతం పెరిగి 50.89 డాలర్లకు చేరుకుంది. మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ మాట్లాడుతూ.. డాలర్ బలపడడంతో బంగారం పెరుగుదల పరిమితంగా ఉందని.. దాంతో స్పాట్ గోల్డ్ ప్రస్తుతం ఫ్లాట్‌గా ట్రేడవుతోందన్నారు. తైవాన్‌పై చైనా చేసిన వ్యాఖ్యలతో డ్రాగన్-జపనీస్ ఉద్రిక్తలు ప్రతికూలతలను తగ్గించాయన్నారు. ఆగ్‌మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా చైనాని మాట్లాడుతూ.. గత వారం మార్కెట్‌లో భారీ అమ్మకాలు జరిగాయన్నారు. డిసెంబర్‌లో వడ్డీ రేట్ల అంచనాలు తగ్గాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ అధికారుల వ్యాఖ్యల ఫలితంగా బంగారం ధరలు 2.5శాతం, వెండి ధరలు 5.5శాతం తగ్గాయి. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల పసిడి రూ.1,25,400 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,950 వద్ద ట్రేడవుతున్నది. ఇక కిలో వెండి రూ.1,73,000 పలుకుతున్నది.

## 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' తో కలిసి..



ప్రముఖ నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ'తో అగ్ర కథనాయకుడు పవన్‌కల్యాణ్ స్థాపించిన 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సంస్థ చేతులు కలిపిన విషయం విదితమే. ఈ రెండు సంస్థలు కలిసి చిత్రాలను నిర్మించేందుకు సిద్ధమవుతున్నాయి. గతంలోనే ఈ సంస్థల మధ్య కథలకు సంబంధించిన చర్చలు జరిగాయి. తాజాగా మరోసారి పవన్‌కల్యాణ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కలిసి తాము భవిష్యత్‌లో చేయబోయే సినిమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సంస్థ స్పందిస్తూ.. 'భోగి పండుగ సందర్భంగా.. కొత్త ఆరంభాల స్ఫూర్తిని సూచిస్తూ.. చేయబోయే ప్రాజెక్టులపై పవన్‌కల్యాణ్, పీపుల్ మీడియా అధినేత విశ్వప్రసాద్ కలిసి మరింత విస్తృతంగా చర్చించారు.' అని పేర్కొన్నది. ఈ పోస్ట్‌కు నిర్మాత విశ్వప్రసాద్ బదులిస్తూ.. 'కథలపై చర్చించే అవకాశం కల్పించిన పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు. ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన కంటెంట్‌ని అందించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం. 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్'తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాం. అద్భుతమైన ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నాం' అని స్పందించారు.




## లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో..

అగ్ర కథనాయకుడు అల్లు అర్జున్ హీరోగా బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ మేకర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ ప్రతిష్టాత్మక పానిండియా సినిమా తెరకెక్కనున్నది. ఈ సినిమా అభిమానులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించనున్నదని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మేకర్స్ పేర్కొన్నారు. AA23 వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాను బి.వి.ఆర్ట్స్‌తో కలిసి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనున్నది. నవీన్ యర్నేని, వై.రవిశంకర్, బన్నీవాసు ఈ చిత్రానికి నిర్మాతలు కాగా, నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలు. అనిరుధ్ సంగీతం అందిస్తారు. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా కథపై ఇప్పటికే ఫిల్మ్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి.






## గ్రామీణ ప్రేమకథగా కొత్త మలుపు



ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'కొత్త మలుపు'. భైరవి ఆర్యా కథనాయిక. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకుడు. తాటి బాలకృష్ణ నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. గ్రామీణ వాతావరణంలో సాగే ఈ రొమాంటిక్ ప్రేమకథలో సస్పెన్స్‌తోపాటు వినోదం కూడా ఉంటుందని, ఆకాష్, భైరవి బావామరదళ్లుగా నటించారని, త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామని దర్శకుడు తెలిపారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యశ్వంత్, నిర్మాణం: తథస్తు క్రియేషన్స్.






Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com